క్లుప్తంగా

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి



పెబ్బేరు రూరల్: వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, రమేష్, గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం వనపర్తిలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారుమాట్లాడుతూ పంటకు విత్తనం ఎంతో కీలకమైందని, నకిలీ విత్తనాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నకిలీ విత్తనాలతో సరైన దిగుబడి రాక రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయన్నారు. అలాగే రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. టాస్క్ ఫోర్స్ టీంల ఆధ్వర్యంలో విత్తన దుకాణాలను నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారని, డీలర్ల వద్ద గల విత్తనాల స్టాక్‌లను శాంపిల్ పరిశీలించాకే పంపిణీకి అనుమతించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా చిన్న, సన్న కారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మిన వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చట్టాలు చేసి, అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పూరి సురేష్‌కు సన్మానం



ఆత్మకూర్: తమిళనాడు ఆసియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన ఆర్యవైశ్య సంఘం జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్‌ను శనివారం ఆత్మకూర్‌లో ఆర్యవైశ్యులు సత్కరించారు. కరోనా కాలంలో విశిష్టమైన సేవలు అందించడంతో పాటు నిత్యం ప్రజాసేవలో ముందుండే పూరి సురేష్‌కు డాక్టరేట్ రావడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు నర్సింహయ్యశెట్టి, నాగరాజు, శేఖర్, శివరాజు, లక్ష్మీనారాయణ, గణేష్, పరమేష్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 20వ వార్డు గాంధీనగర్‌కు చెందిన మల్లెల వెంకటయ్య శుక్రవారం మృతి చెందారు. స్థానిక నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలపడంతో ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ ద్వారా రూ.5వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ మేరకు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి అండగా ఉంటారని, దిగులు చెందొద్దని బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు.

రేపటి నుంచి రాజకీయ శిక్షణ తరగతులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సోమ, మంగళవారం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని యువత అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

అందని పశువైద్యం



పెద్దదగడలో శిథిలావస్థకు చేరిన ఆస్పత్రి భవనం

- వేధిస్తున్న ఖాళీలు, మందుల కొరత
- శిథిలావస్థలో ఆస్పత్రి భవనాలు

చిన్నంబావి: మండలంలో పశు వైద్యం అందని ద్రాక్షలా మారింది. పశువుల ఆస్పత్రుల్లో వైద్యుల నియామకం చేయకపోవడంతో పాటు సరైన మందులు కూడా అందుబాటులో లేకపోవడంతో మూగ జీవాలకు వైద్యం అందని దుస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా ఉన్న పశు ఆస్పత్రుల భవనాలు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వాటిలో ఉన్న అరకొర మందులను కూడా నిల్వ చేసుకునే వెలుసుబాటు లేదు. మండలంలో పశువైద్యం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. మండలంలో వెలగొండ, పెద్దదగడ, కొప్పునూరు గ్రామాల్లో మూడు పశువైద్యశాలలు ఉన్నాయి.

పశువులు మృతి

మండలంలోని అయ్యవారిపల్లిలో మూడు రోజుల క్రితం మొక్కజొన్న మొలకలను పది పశువులు తినడంతో దాంట్లో నాలుగు గేదెలు, ఒక ఆవు అక్కడిక్కడే మృత్యువాత పడ్డాయి. మరో పది పశువులకు గ్రామానికి చెందిన పశువైద్యాధికారి చికిత్స చేయడంతో అవి బతికాయి. డాక్టర్ ఆ సమయంలో అందుబాటులో లేకపోతే భారీ నష్టం జరిగేదని పశువుల యజమానులు వాపోయారు. కానీ చాలా గ్రామాల్లో సరైన సమయానికి వైద్యం అందక పశువులు, గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొప్పునూరులో పశువులకు వైద్యం చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఐదు పశుఆస్పత్రులు

మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా చిన్న, పెద్ద పశువైద్యశాలలు కలిపి మొత్తం 5 ఉన్నాయి. వీటిలో ఎనిమిది మంది వైద్యులు అవసరం కాగా కేవలం ఇద్దరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగతా ఆరు పోస్టులు దీర్ఘకాలంగా భర్తీకి నోచుకోవడం లేదు. గ్రామీణ అసిస్టెంట్ సర్జన్, ఆఫీస్ సబార్డినేటర్, వీరి కింద పని చేసే లైవ్ స్టాక్ సహాయక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఆస్పత్రులు లేని అయ్యవారిపల్లి, బెక్కెం గ్రామాల్లో ఇద్దరు సిబ్బందితో పనులు కానిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో వైద్యం అందక పశువులు మృత్యువాత పడుతున్నాయి.

వైద్యులు అందుబాటులో ఉండాలి



గ్రామంలోని పశువైద్యశాలలకు వైద్యులు పూర్తి స్థాయిలో లేరు. ఉన్న అరకొర సిబ్బంది కూడా గ్రామాల్లో అందుబాటులో ఉండడం లేదు. సరైన సమయంలో వైద్యులు లేకపోవడంతో ఏ చిన్నపాటి రోగం వచ్చినా పట్టించుకునే వారు లేకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బందిని నియమించడంతో పాటు మందులు అందుబాటులో ఉంచాలి.

– సుధాకర్, గూడెం

కూలిపోయే స్థితి

మండలంలో ఉన్న పశు వైద్యశాలలను ఏళ్ల కిందట నిర్మించడంతో ప్రస్తుతం అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని మూడు పశు వైద్యశాల భవనాలు ఇప్పుడో అప్పుడో కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయి.

పాఠశాల పరిసరాల్లో దుర్గంధం



మురుగు కాల్వకు అడ్డుగా వేసిన మట్టి దిబ్బలు

- మురుగు, దోమల బెడదతో ఇబ్బందులు
- డ్రెయినేజీలు నిర్మించాలంటున్న కాలనీవాసులు

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల పరిసరాలు మురుగుమయం కావడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీటితో పాటు, మురుగు చేరుకోవడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రారంభం అయ్యేలోపు డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం పాలకమండలి దృష్టికి తీసుకెళ్లామని, అయినా స్పందన లేదని వార్డు కౌన్సిలర్ నాగలక్ష్మినాగేందర్ అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



కాలనీలోని రోడ్డు పక్కన ముళ్లపొదలు



మురుగు నిల్వ



అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

నిన్న అలా.. నేడు ఇలా..

అమరచింత: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బడి బయటి విద్యార్థులను గుర్తించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన పదో తరగతి విద్యార్థుల ప్రతిభకు సంబంధించిన ఫ్లెక్సీని పాఠశాల ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేశారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే వసతుల కరపత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. కానీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడం ఏమిటని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బలరాముడు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న సీసీ కెమరాను సైతం పగులగొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పెద్దలు ఇలాంటి ఘటనలను వ్యతిరేకించి, పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.



ఫ్లెక్సీని తొలగించడంతో ఖాళీ కట్టెలు

పాన్‌గల్‌లో 58.07 మి.మీ. వర్షపాతం నమోదు



పాన్‌గల్ పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. రెండు రోజుల పాటు మండలంలో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. చెరువులు, కుంటలకు వరద నీరు భారీగా చేరింది. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిల్వతో ఈ రోడ్డు ద్వారా వెళ్లే కాలనీవాసులు, స్టేషన్‌కు వెళ్లే వారికి ఇబ్బందిగా మారింది. పలు కాలనీల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైనే నిలిచిపోయింది. మండలంలో 58.07 మీ.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ అశోక్ తెలిపారు.

‘నీట్’ పేపర్ లీకేజీపై విచారణ చేయాలి

కొల్లాపూర్: నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక ఆరోపణలు వస్తున్నాయన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షల్లో పారదర్శకత లోపించినట్లు ఆరోపించారు. ఒక సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు వందశాతం మార్కులు రావడం యాదృచ్ఛికం కాదన్నారు. పరీక్షల నిర్వహణ తీరుపై, పేపర్ లీకేజీ అంశాలపై జ్యుడీషియల్ విచారణ చేయాలని కోరారు.

మానవత్వం చాటిన ఎస్‌ఐ

మానవపాడు: ఎర్రవల్లి చౌరస్తా నుంచి గద్వాలకు శనివారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి మార్గ మధ్యలో దయ్యాల వాగు సమీపంలో అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి రోడ్డుపై పడ్డాడు. అదేమార్గంలో పోలీస్ ఉన్నతాధికారుల సమావేశానికి మానవపాడు మండలం నుంచి గద్వాలకు ఎస్‌ఐ చంద్రకాంత్, సిబ్బందితో వెళ్తున్నాడు. దయ్యాల వాగు దగ్గర కిందపడ్డ వ్యక్తిని గమనించి ఫిట్స్ వచ్చాయని గమనించారు. తాళాలు చేతిలో పెట్టి ఆ వ్యక్తికి ఫిట్స్ సాధారణ స్థితికి వచ్చేంతవరకు అక్కడే ఉన్నారు. వ్యక్తి సాధారణ స్థితికి రాగానే గద్వాలకు వెళ్లిపోయారు. దీంతో పలువురు ఎస్‌ఐ చంద్రకాంత్‌ను అభినందించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొల్లాపూర్: అచ్చంపేటలో శనివారం నిర్వహించిన తెలంగాణ తైక్వాండో కలర్ బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. అనీష్‌గౌడ్, అంశిత, మేఘన, రాకేష్, తేజస్ ఎల్లో బెల్ట్, రాధాకృష్ణయాదవ్, మనోహర్, అజిత్ ఎల్లో–1, అమ్మగారి గౌతమ్‌సాయి గ్రీన్ బెల్టులు సాధించారు. వీరికి తైక్వాండో జిల్లా జనరల్ సెక్రటరీ శేఖర్, మాస్టర్ శరబంద బెల్టులు ప్రదానం చేశారు.



అభివృద్ధిలో పోటీపడుతాం



ఆర్థికసాయం అందజేస్తున్న బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి

ఆత్మకూర్: మక్తల్ నియోజకవర్గంలోని మండలాల్లో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణమ్మ ఆధ్వర్యంలో అభివృద్ధిలో పోటీపడదామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం బీజేపీ నాయకులతో కలిసి మండలంలోని ఆరేపల్లి, జూరాల, ఆత్మకూర్‌లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరేపల్లిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో రిమాండ్ అయిన బీజేపీ నాయకుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలోని ఓ కాలనీలో తాగునీటి ఇబ్బంది ఉందని గ్రామస్తులు తెలుపడంతో తన సొంత నిధులతో తాగునీటికి సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఆత్మకూర్‌లో వర్షం కారణంగా కుర్మన్న అనే వ్యక్తి ఇల్లు పైకప్పు కూలిపోవడంతో కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. పెద్దమ్మ గుడితో పాటు తాగునీటి ఇబ్బందులున్న కాలనీల్లో సొంతంగా మినీ వాటర్ ట్యాంకులను నిర్మిస్తామన్నారు. కేంద్రంలో మూడోసారి కొలువుదీరనున్న ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో అరుణమ్మకు మంత్రి పదవి ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పుర్‌ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, అనిల్‌గౌడ్, మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు అజిత్‌రెడ్డి, ఆనంద్, బాలకృష్ణ, తమ్మలివిజయ్, రాజు, ఎల్లన్న, మహేందర్‌రెడ్డి, చందు, అంజనేయులు, కృష్ణయ్య, వెంకట్రాములు, రాము, సురేష్,నరేందర్, శ్యాం, సూరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏటా ఇబ్బందులే!

మదనాపురం: మండలంలోని దంతనూరు, శంకరమ్మపేట గ్రామాల మధ్య ఊకచెట్టు వాగుపై కాజ్‌వే నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో శంకరసముద్రానికి వరద పోటెత్తుంది. రిజర్వాయర్ నుంచి నీటిని దిగువకు విడుదల చేయడంతో ఊకచెట్టు వాగులో వరద తాకిడి పెరుగుతుంది. దంతనూరు, శంకరమ్మపేట గ్రామాల మధ్య ఊకచెట్టు వాగుపై గతంలో చిన్నగా నిర్మించిన వంతెనపై నీరు ఉధృతంగా ప్రవహించి రెండు గ్రామాలకు సంబంధాలు పూర్తి తెగిపోతున్నాయి. మూడేళ్లుగా ఈ పరిస్థితి నెలకొంది. వాగుకు రెండు వైపులా ఉన్న పంట పొలాలకు వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సరళాసాగర్ ప్రాజెక్టు వెళ్లాలంటే చుట్టూ తిరిగి కొత్తకోట మండలం పాలెం మీదుగా వెళ్లాల్సి వచ్చింది. ఇప్పటికే వంతెన పూర్తి స్థాయిలో దెబ్బతింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాలకులు స్పందించి కాజ్‌వే నిర్మాణం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వరద ఉధృతి పెరగక ముందే అధికారులు చర్యలు తీసుకొని, వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలి విన్నవిస్తున్నారు.



దంతనూరు శివారులో ఊకచెట్టు వాగులో కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద (ఫైల్)

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



కొల్లాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మెజిస్ట్రేట్ శ్రీనిధి సమక్షంలో పలువురు కక్షిదారులు రాజీపడ్డారు. నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల 18 కేసులు రాజీమార్గంలో పరిష్కారమయ్యాయి. ఎక్సైజ్ శాఖకు సంబంధించిన 28 కేసుల్లో నిందితులకు అపరాధ రుసుము విధించారు. పెట్టి చలాన్‌లకు సంబంధించిన 1,710 కేసులతో పాటు, 3 సైబర్ క్రైం కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యాయి. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ చిన్నపాటి తగాదాలు, వివాదాలను లోక్‌అదాలత్‌లో రాజీమార్గంలో పరిష్కరించుకోవడం మంచి మార్గమని సూచించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు ఆర్.కురుమూర్తి, మోహన్‌లాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి, ఉన్నారు.

కల్వకుర్తి టౌన్: కక్షిదారులు పంతాలకు పోకుండా వారి కేసుల విషయంలో రాజీమార్గంలో వెళితే పరిష్కారం లభిస్తుందని కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో జూనియర్ సివిల్ జడ్జి కావ్యతో కలిసి ఆమె పాల్గొన్నారు. కోర్టు పరిధిలోని పలు కేసులకు సంబంధించి కక్షిదారులు రాజీ కుదుర్చుకున్నట్లుగా కోర్టు అధికారులు తెలిపారు.

ప్రమాదకరంగా సర్వీస్ రోడ్డు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని జానంపేట వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. కొన్నాళ్ల కిందట సర్వీస్ రోడ్డుపై బీటీ వేయించి వేయించారు. పాత పెట్రోల్ పంపు ఎదురుగా రైస్ మిల్లు పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు వద్ద కల్వర్టుకు ఒకవైపు మాత్రమే రక్షణ గోడ ఉంది. మరో వైపు రక్షణ గోడ లేదు. ఇక్కడ జాతీయ రహదారిపై మూసాపేట వైపు నుంచి జానంపేట ఊర్లోకి సర్వీస్ రోడ్డుపై మళ్లే వాహనాలకు రక్షణ గోడ లేని కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. రాత్రివేళ ద్విచక్రవాహనాలు, ఆటోలు కల్వర్టు వద్ద ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. హైవేను దిగి వచ్చే సమయంలో డ్రైవర్లు ఏమాత్రం అజాగ్రత్త వహించినా కల్వర్టులో పడిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా రహదారి నిర్వాహకులు స్పందించి కల్వర్టు వద్ద రక్షణ గోడ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.



బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడి బాట కార్యక్రమంలో భాగంగా శనివారం కొత్తకోట బాలికల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ బడి మానేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 11మంది పిల్లలు బడి మానేయడంతో వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి బడిలో చేర్పించేందుకు ఆసక్తి కల్పించారు. అనంతరం హెచ్ఎం నర్సమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, పుస్తకాలు ఇవ్వడంతో పాటు మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం గీతాబాయి, మాధవి, విజయ, నాగమణి, ప్రభావతి తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: నాణ్యమైన విద్య కోసం పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంతో పాటు గోప్లాపూర్, రేమద్దుల, కొత్తపేట, శాగాపూర్ గ్రామాల్లోని ఉపాధ్యాయులు బడి బాట ర్యాలీలు నిర్వహించి ప్రచారం నిర్వహించారు.

పెబ్బేరు రూరల్: ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమంలో బడి బయటి పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు హెచ్ఎం గణేష్‌కుమార్ తెలిపారు. వనపర్తి మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం , ఉపాధ్యాయులతో కలిసి గ్రామ శివారులోని చేపల చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి విద్య యొక్క ప్రాధాన్యత గురించి వివరించారు.

ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని హెచ్ఎంలు సుధారాణి, శ్రీనివాస్‌రెడ్డి, నాగమణి అన్నారు. శనివారం మండలంలోని ఖిల్లాఘనపురం బాలికల ఉన్నత పాఠశాల, సోళీపురం, ఉప్పరిపల్లి తదితర అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటుగా ప్రభుత్వం అన్ని వసతులు కల్పించిందన్నారు.



ఖిల్లాఘనపురం మండలం సోళీపురంలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



పాన్‌గల్‌లో..



కొత్తకోటలో..



పాన్‌గల్ మండలం శాగాపూర్‌లో..